ఈసీ నిబంధనల మేరకు సవరణలు

- కొత్త పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు, సలహాలు ఇవ్వండి
- రాజకీయ పార్టీలను కోరిన కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటరు జాబితా రూపకల్పనలో మార్పులు, చేర్పులు ఉంటాయని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి రాజకీయ పార్టీలకు సూచించారు. గురువారం కలెక్టర్ తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అంతకుముందు ఎన్నికల గోదామును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 237 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు బీఎల్ఓలను నియమించుకొని ఓటరు జాబితా రూపకల్పనలో భాగస్వామ్యం కావాలన్నారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ.. జిల్లాలో ఫారం - 6, 7, 8 ఫారాలకు సంబంధించి మొత్తం 976 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి పూర్తి చెస్తామని చెప్పారు. ఇందుకు రాజకీయ పార్టీల బీఎల్ఓలు సహకరించాలని కోరారు. మరోవైపు కాలేజీల్లో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

గుండె జబ్బులపై అవగాహన

గుండె జబ్బులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా జీవించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సూచించారు. గురువారం కలెక్టర్ తన చాంబరులో కర్నూలు హార్టు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ హృదయ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆమె విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం, దురలవాట్లకు దూరంగా ఉంటే గుండె ఆరోగ్యంగా ఉంటుందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ద్వారా 2002 నుంచి ప్రజలకు హృదయ రోగాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. హార్ట్ ఫౌండేషన్ సభ్యులు కల్కూర చంద్రశేఖర్, డాక్టర్ భవాని ప్రసాదు, ట్రేజరర్ రాముడు, సభ్యులు శర్మ, లక్ష్మణ్, వాసుదేవమూర్తి,జగన్నాథగుప్తా పాల్గొన్నారు.

క్విజ్ పోటీలకు ఆహ్వానం

జిల్లా యువజన సంక్షేమ శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ పోటీల్లో జిల్లావాసులు పాల్గొనాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ఆ శాఖ సీఈఓ వేణుగోపాల్‌తో కలిసి క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని యువజనోత్సవం కార్యక్రమంలో భాగంగా 15 – 29 ఏళ్ల యువకులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్విజ్ పోటీలు జరుగుతాయని, పూర్తి వివరాలకు www.mybharat.gov.in/pages/vbyld_2026 వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. జిల్లా టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, క్లస్టర్ వర్సిటీ డీన్ డాక్టర్ మహమ్మద్, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు పాల్గొన్నారు.

శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


సంకల్‌బాగ్ వద్ద చీపురు పట్టి చెత్తను తొలగిస్తున్న కలెక్టర్

కర్నూలు (టౌన్): స్వచ్ఛతా హీ సేవ-2025లో భాగంగా ఏక్ దిన్- ఏక్ ఘంట- ఏక్ సాథ్ కార్యక్రమంలో కలెక్టర్ కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పాల్గొన్నారు. సంకల్‌బాగ్ వద్ద మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి చీపురు చేతపట్టి చెత్తను తొలగించారు. మన ఇంటితో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా, సాంకేతిక సహకారంపై ఒప్పందం

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు అవసరాల కోసం ఎక్సెల్‌ఆర్ ఎడ్యుటెక్ ప్రైవేటు లిమిటెడ్‌తో కలిసి ఎడ్రీడే లెర్నింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం క్లస్టర్ వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎక్సెల్‌ఆర్ ఎడ్యుటెక్ ప్రైవేటు లిమిటెడ్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు 365 రోజుల పాటు ఉచిత ఆన్‌లైన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అందించబడతాయన్నారు. అనంతరం ఎక్సెల్‌ఆర్ ఎడ్యుటెక్ వ్యవస్థాపకులు సీఈఓ శ్రీరామ్ టవ్వా మాట్లాడుతూ.. ఎడ్రీడే లెర్నింగ్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు పొందుతారన్నారు. అనంతరం ఒప్పంద పత్రాలపై ఇరువురు సంతకాలు చేశారు. వర్సిటీ డీన్స్ మహమ్మద్ వాయిజ్, డాక్టర్ నాగరాజు శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో గురువారం రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ పోటీలను ప్రారంభించారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, నిర్వాహకులు నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫార్మసిస్టుల పాత్ర కీలకం


ఫార్మసిస్టులతో ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో రోగులకు ఔషధాలను అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు చెప్పారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని గురువారం ఆసుపత్రిలోని ఫార్మసీ కౌంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలో పనిచేసే ఫార్మసిస్టులను అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ.. మార్కెట్‌లోకి వచ్చే ప్రతి టాబ్లెట్ ఎన్నో సంవత్సరాల క్లినికల్ ట్రయిల్స్ (పరిశోధనలు) తర్వాత బయటకు వస్తాయని, ఎంతో ఓపిక, సహనంతో ఈ మందుల తయారీలో పాల్గొనే ఫార్మసిసులు అభినందనీయులని చెప్పారు. ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, డ్రగ్ స్టోర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, ఫార్మసిస్టులు సోమశేఖర్, వీరాంజనేయులు, సత్యప్రసాద్, బీవీఆర్ శ్రీనివాస్, రాజేష్, రిటైర్డ్ ఫార్మాసిస్టు నరసింహరావు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌కు డాక్టరేట్


ఎం.ఎల్లన్న

కర్నూలు సిటీ: మిడ్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పని చేస్తున్న ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్ మచ్చుకంటి ఎల్లన్నకు గీతం యూనివర్సిటీ (బెంగళూరు) డాక్టరేట్ ప్రదానం చేసింది. జూపాడుబంగ్లా మండలం పారుమంచాలకు చెందిన ఈయన భౌతిక శాస్త్రంలో నికెల్ గడాలోనియం ఫెరైట్, నికెల్ యూరోపియం ఫెరైట్ అనే అంశాలపై గీతం యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కడియాల చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాలు


మాట్లాడుతున్న డాక్టర్ ఉమ

కర్నూలు (హాస్పిటల్): స్వచ్ఛతా హీ సేవ - సఫాయీ సురక్ష శిబిర్ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని మార్కెట్ యార్డు, ఎన్టీఆర్ కాలనీలలో ఉన్న యూపీహెచ్‌సీలలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ డాక్టర్ ఉమ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, తగిన చికిత్సలు, మందులు అందించి సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీపీఓ విజయరాజు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నాగసౌమ్య, డాక్టర్ శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనమిత్ర గడువు పెంచాలి


ధర్నా చేస్తున్న ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): వాహన మిత్ర గడువు పెంచి కార్మికులందరూ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రతి ఆటో కార్మికుడికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రశేఖర్, రాముడు పాల్గొన్నారు.

ఈఈల బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీఎస్‌పీడీసీఎల్ కర్నూలు కార్యాలయంలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాధ్యతలు చేపట్టారు.కర్నూలు సర్కిల్ కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్ ఈఈగా పని చేస్తున్న వైవీ మహేశ్వరరెడ్డి టెక్నికల్ ఈఈగా నియమితులయ్యారు.అలాగే అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో డీఈఈగా పనిచేస్తున్న ఎం.భాస్కర్‌రావుకు ఈఈగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. వీరిద్దరూ గురువారం బాధ్యతలు చేపట్టారు.

రక్తహీనతతో గర్భిణులకు ఆరోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత వల్ల గర్భిణులకు పలు ఆరోగ్య సమస్యలు వస్తాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర ప్రసాద్ చెప్పారు. స్థానిక వడ్డెగేరి యూపీహెచ్‌సీలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో ఎన్‌సీడీ 4.ఓ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు, గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రక్తహీనత వల్ల మహిళల్లో అలసట, నీరసం వంటి ఆరోగ్య సమస్యలతో పాటు నెలసరి సమయంలో హెచ్చుతగ్గులు, గర్భం ధరించలేకపోవడం, గర్భం వచ్చినా నిలబడకపోవడం, ప్రసూతి మరణాలు వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల ఆరోగ్యానికి ఆర్‌బీఎస్‌కే పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. వైద్యులు వెంకటప్రవీణ్, జాహ్నవి, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీని విరమించుకోండి


ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మత్స్యకార సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని విరమించుకోవాలని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెస్త శ్రీనివాసులు కోరారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని సంఘం కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. గతంలో ఆ ప్రాంతంలో నిర్మించిన హెట్రో పరిశ్రమలోని కాలుష్యం సముద్రంలో ఇంకడం వల్ల అక్కడి మత్స్యకారులు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాన్సర్, టీబీ, చర్మవ్యాధులతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే బల్క్‌డ్రగ్ ఫ్యాక్టరీ వల్ల కూడా అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఆయా ఫ్యాక్టరీలు వదిలే వ్యర్థాల వల్ల సముద్రంలోని మత్స్య సంపద, జల సంపద నాశనం అవుతుందన్నారు. బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ వద్దని పోరాటం చేస్తున్న మత్స్యకారులపై తప్పుడు కేసులు పెట్టాలని ప్రభుత్వం చూడటం దుర్మార్గమన్నారు. అదే జరిగితే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీపీయూ ఎస్ఐ పార్టీ జాతీయ కార్యదర్శి పగడాల కోదండ, నాయకులు హరీష్, ప్రింటింగ్ రఘు, శ్రీనివాసులు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోకుంటే చర్యలు


నిరసన వ్యక్తం చేస్తున్న జి.రామకృష్ణయాదవ్

కర్నూలు(సెంట్రల్): తనపై ఓ మహిళ చేస్తున్న అసత్య ప్రచారాన్ని పనిగట్టుకొని ప్రచురిస్తున్న మీడియా సంస్థలు, సదరు మహిళపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని మామిదాలపాడు బాలాజీ నగర్‌కు చెందిన రామకృష్ణయాదవ్ స్పష్టం చేశారు. ఆయన గురువారం తన లాయర్లతో కలిసి కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనకు మామిదాలపాడు సర్వే నంబర్ 130/3 ఎఫ్‌లో వేసిన ఓ వెంచర్‌లో 61, 62 ప్లాట్లలో 1.5 సెంట్ల స్థలం ఉందన్నారు. ఆ స్థలంలో రెండు షెడ్లు వేసి బాడుగకు ఇచ్చానని, అయితే ఆ ప్లాట్లు తనవని బాలాజీనగర్‌కు చెందిన శాంతమ్మ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. తనకు వెంకట శివ ప్రసాదు అనే వ్యక్తి నుంచి 65/1985 డాక్యుమెంట్ ద్వారా ఆ ప్లాట్లు సంక్రమించాయని వివరించారు. ఆమెకు 130/1లో ఉన్న లేవుట్‌లో ప్లాట్లు ఉండొచ్చని, నా ప్లాట్లను ఆమె తనవిగా చెప్పడం, కొన్ని మీడియా సంస్థల్లో వాటిని ప్రచురిస్తుండడంతో తన పరువుకు భంగం కలుగుతోందన్నారు. ప్లాట్లకు కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కూడా తెచ్చుకున్నానని చెప్పారు.

రోడ్డుసైడు వ్యాపారులపై వేధింపులు ఆపాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రోడ్డు సైడు వ్యాపారస్తులు


కర్నూలు(సెంట్రల్): రోడ్డు సైడు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిపై మునిసిపల్ అధికారుల వేధింపులను తక్షణమే ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని కొందరు అధికారులు ట్రాఫిక్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లలో రవాణాకు ఇబ్బంది లేకున్నా మునిసిపల్ అధికారులు, పోలీసులు బెదిరించడం అన్యాయమన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్నలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. అంతకముందు జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో మారెళ్ల విజయ రామాంజనేయులు, ఆర్.నరసింహులు, మహ్మద్, కుమార్, సాల్మన్‌రాజు, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ బాధ్యతయుతంగా పని చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌టీయూసీ అధికార ప్రతినిధిగా నియమితులైన ఉలిందకొండ రమణారెడ్డి గురువారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మాల, శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు వరిస్తాయన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పదవులు పొందిన వారందరూ సమన్వయంగా, సమష్టిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశాయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లా వెంకట రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, చాంద్‌బాషా, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసిస్టు డే


వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, ఫార్మసిస్టులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో గురువారం వరల్డ్ ఫార్మసిస్టు డే ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఫార్మసిస్టుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారిని సన్మానించారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి ఫార్మసిస్టుల సేవలను కొనియాడారు.

కర్నూలు సిటీ: స్థానిక ఏక్యాంపులోని మథర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కర్నూలు రూరల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జయరాముడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైద్య రంగంలో ఫార్మసిస్టులది కీలకపాత్ర అన్నారు. ఫార్మసీ రంగంలో అనేక పరిశోధనలు జరుగుతున్నాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల వీడియో ప్రజెంటేషన్స్, పోస్టర్, ఫార్మసీ నమూనాలు, యానిమేషన్ వీడియోస్ ప్రదర్శించారు. ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(సెంట్రల్): అనంతపురం జిల్లా హంపాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తూ కరెంట్ షాక్‌కు గురై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బెంగాల్‌కు చెందిన షేక్ బైసీకి మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, నగర అధ్యక్ష, కార్యదర్శులు వైనగేష్, ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. వారు గురువారం ఆస్పత్రికి వెళ్లి కార్మికుడిని పరామర్శించారు.

యోగా ఫెడరేషన్ డైరెక్టర్‌గా అవినాష్


అవినాష్ శెట్టి

కర్నూలు (టౌన్): ఇంటర్నేషనల్ యోగా ఫెడరేషన్ డైరెక్టర్‌గా అవినాష్ శెట్టి నియమితులయ్యారు. జిల్లా యోగా సంఘం అధ్యక్షుడిగా ఉన్న ఆయన్ను డైరెక్టర్‌గా నియమిస్తూ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఏషియా అధ్యక్షుడు డాక్టర్ రాధాక్రిష్ణ, అంతర్జాతీయ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ధర్మాచారి మైత్రానంద్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన 2028 వరకు డైరెక్టర్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కబడ్డీలో సత్తా చాటాలి


క్రీడాకారులతో వీసీ వెంకట బసవరావు తదితరులు


కర్నూలు (టౌన్): ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించే అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో ఆర్‌యూ జట్టు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని వీసీ వి.వెంకట బసవరావు సూచించారు. గురువారం వర్సిటీలోని తన చాంబర్‌లో కబడ్డీ జట్టుకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

ఆటోవాలా నిజాయితీ


ఆటోడ్రైవర్‌ను సత్కరిస్తున్న సీఐ విక్రమసింహా

కర్నూలు: ప్రయాణికుడు ఆటోలో మర్చిపోయిన రూ.80 వేలు విలువ చేసే ఐఫోన్‌ను బాధితుడికి అప్పగించి ఆటోడ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. అభిరామ్ అనే ప్రయాణికుడు కుటుంబ సభ్యులతో మౌర్యా ఇన్ జంక్షన్ వద్ద ఆటో ఎక్కి బృందావన్ నగర్‌లో దిగిపోయాడు. తన ఐఫోన్‌ను ఆటోలోనే మర్చిపోయాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన ఆటో డ్రైవర్ రవికుమార్‌నాయక్ వెంకటరమణ కాలనీలో పెట్రోల్ వేయించుకునేందుకు ఆటో దిగి చూసుకోగా వెనక సీటులో ఐఫోన్ కనిపించింది. తిరిగి ప్రయాణికులను దింపిన ప్రాంతానికి వెళ్లి సెల్‌ఫోన్ మర్చిపోయిన విషయాన్ని వారికి వివరించి నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా సమక్షంలో బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. ఆటోడ్రైవర్ రవికుమార్ నిజాయితీని అభినందిస్తూ సీఐ శాలువా కప్పి సన్మానించారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు

కర్నూలు కల్చరల్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు బీఈడీ కళాశాలలకు సొంత భవనాలు లేకున్నా వర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. నాయకులు కిరణ్, శివ, నిఖిల్ ఉన్నారు.

ఈ-హాస్పిటల్‌తో వేగంగా వైద్యసేవలు


డాక్టర్ కె.చిట్టి నరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఈ-హాస్పిటల్ ద్వారా రోగులకు వేగంగా వైద్య సేవలు అందుతాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. గురువారం కేఎంసీ ఆడిటోరియంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నెక్ట్స్ జెన్ ఈ-హాస్పిటల్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. వైద్యులు, నర్సింగ్, ఫార్మసీ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, టెక్నీషియన్లు, రీజనల్ ఐ హాస్పిటల్ వైద్యులు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులకు ఈ-హాస్పిటల్ సేవల కోసం నెక్ట్స్ జెన్ పోర్టల్, అభా ఫార్మసీ మాడ్యూల్, ల్యాబ్, రేడియాలజీ, ఈ-హాస్పిటల్‌కు సంబంధించిన సేవల గురించి ఏపీడీఎం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కోటిరెడ్డి, రోల్ అవుట్ మేనేజర్ సురేష్, ఈ-హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శివబాల నాగాంజన్ శిక్షణ ఇచ్చారు. భవిష్యత్‌లో ప్రతిరోగి డిజిటల్ హెల్త్ రికార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా వైద్య సేవలు అందుకోవచ్చన్నారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు మాట్లాడారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ రికార్డు వినియోగం, రోగుల వైద్యచరిత్ర, భద్రత, అత్యవసర పరిస్థితుల్లో టెలిమెడిసిన్ ద్వారా కన్సల్టేషన్ వంటి అంశాలపై నిపుణులు వివరణాత్మకంగా శిక్షణ ఇచ్చారు. కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమదానం


స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ బ్యాంకు అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): మన ఇళ్లు, కార్యాలయాల పరిసరాలు బాగుంటే అందరం బాగున్నట్లేనని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి జోనల్ హెడ్ పత్రి శ్రీనివాస్ కుమార్ అన్నారు. బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు గురువారం చాణక్యపురి కాలనీ పార్క్‌లో బ్యాంకు సిబ్బంది శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. అలాగే మొక్కలు నాటారు.పరిసరాల శుభ్రత, సామాజిక భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు.బ్యాంకు రీజనల్ హెడ్ పి.నరసింహారావు పాల్గొన్నారు.

రేపు లోక కళ్యాణ మేళా

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఈ నెల 27వ తేదీన వీధి వ్యాపారుల కోసం లోక కళ్యాణ మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వీధి వ్యాపారులు వినియోగించుకోవాలన్నారు. మేళాలో పీఎం స్వానిధి 2.0 పథకం కింద కొత్త దరఖాస్తుల స్వీకరణ, ఇప్పటికే మంజూరైన దరఖాస్తుల రుణ పంపిణీని సులభతరం చేయడం, లబ్ధిదారులకు డిజిటల్ ఆన్ బోర్డింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. గురువారం తన చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 41 మంది ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు వివరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకునేందుకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధిక వర్షాలకు పత్తి, ఉల్లి, టమాటా పంటలు పూర్తిగా కుళ్లిపోయి రైతులకు ఏమాత్రం చేతికి రాలేదన్నారు. మరోవైపు సజ్జ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రస్తుతం మార్కెట్లలో క్వింటాల్‌కు రూ.1800 మాత్రమే ధర లభిస్తోందన్నారు. ఇది ఏమాత్రం సరిపోదని క్వింటాల్‌కు రూ.3 వేలు మద్దతు ధర ఇవ్వాలన్నారు.

హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న బాలాజీ యశోదా హాస్పిటల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళకు బీజేపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బాలాజి యశోదా హాస్పిటల్‌పై పలు ఆరోపణలు ఉన్నాయని, జనన, మరణ సర్టిఫికెట్లకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ని వెంకటేశ్వర్లు, నాయకులు ఉన్నారు.

జిల్లాకు దామోదరం పేరు పెట్టాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని కలిసి విన్నవించారు. నాయకులు వి.కృష్ణయ్య, దామోదరం రాధాకృష్ణమూర్తి, వర్మ, రంగస్వామి ఉన్నారు.